క్లుప్తంగా

ఆధార్ క్యాంపు ప్రారంభం



విద్యార్థినికి ఆధార్ అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు మంగళవారం ఆధార్ క్యాంపు ప్రారంభం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 వరకూ ఆధార్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఆధార్ కార్డు కొత్తగా తీసుకోవాలన్నా, ఆధార్ అప్‌డేట్, ఫోన్ నెంబరు మార్పు, అడ్రస్ మార్పు, పేరు మార్పు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.4 లక్షల ఆదాయం

మడకశిర: మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీ నరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.4 లక్షల ఆదాయం వచ్చినట్లు మడకశిర డిపో మేనేజర్ రామసుబ్బయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మరథోత్సవం, భూతప్పల ఉత్సవం, జ్యోతుల ఊరేగింపు సందర్భంగా 20 ఆర్టీసీ బస్సులు నడిపినట్లు పేర్కొన్నారు.

చింత ఫలసాయం కోసం వేలం



వేలం వేస్తున్న అధికారులు

అమరాపురం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో చింత ఫలసాయం కోసం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దనకుంట గ్రామానికి చెందిన దొడ్డ రంగప్ప రూ.1,12,000 పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో పాటదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆధునిక జీవన విధానంతో ఆరోగ్య సమస్యలు'

హిందూపురం: ఆధునిక జీవన విధానాల వల్లనే ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్య విధానాలపై అవగాహన పెంచుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ అనూషరెడ్డి సూచించారు. స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో సర్వైకల్ క్యాన్సర్, మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలు తీసుకోవాల్సిన ఆహార నియమాలను, జీవన విధానాలు, పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర కుమార్, జేఎస్‌వీఎస్ ప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న గ్రామ పెద్దలు, ప్రజలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో సోమవారం రాత్రి బెంగళూరు గ్రామదేవత, చోళసముద్రం గ్రామదేవతలు అన్నమ్మ, చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాలను లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ సహకారంతో ఘనంగా ఊరేగించారు. రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఉరేగింపు తెల్లవారు 5 గంటల వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు, భోజనాలను పంపిణీ చేశారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



గృహిణికి సూచనలిస్తున్న సీఐ సురేశ్

పావగడ: పట్టణంలో ఇటీవల దొంగతనాలు పెరుగుతుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ సురేశ్ సూచించారు. మంగళవారం ఇంటింటికీ వెళ్లి దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గృహిణులకు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారుల మొబైల్ నంబర్లు ఉన్న స్టిక్కర్లను ఇంటి తలుపులకు అతికించారు. దొంగతనాలకు అవకాశం కల్పించకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచాలన్నారు. అంతే కాకుండా స్టికర్లలో పొందుపరిచిన పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారుల ఫోన్ల నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ స్టికర్లలో ఉన్న పావగడ సీఐ నంబర్ 9480802941, ఎస్ఐ నంబర్ 9480802977, తుమకూరు కంట్రోల్ రూమ్ నంబర్ 9480802900, ఎమర్జెన్సీ నంబర్ 112 కు సమాచారం అందించాలన్నారు.

సమస్యల్లో మడకశిర ఆర్టీసీ డిపో

- వేధిస్తున్న గదుల కొరత
- డీఎం కార్యాలయాన్ని బస్టాండ్‌లో నిర్వహిస్తున్న వైనం
- విడి భాగాల కొరతతో సమస్య
- లోపిస్తున్న బస్సుల కండీషన్



మడకశిర ఆర్టీసీ డిపో



బస్టాండ్‌లోని ఓ గదిలో డీఎం కార్యాలయం నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర ఆర్టీసీ డిపో వివరాలు..

బస్సు సర్వీసుల సంఖ్య	33
డ్రైవర్ల సంఖ్య	78
కండక్టర్ల సంఖ్య	55

మడకశిర: జిల్లాలో పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిర ఆర్టీసీ డిపోలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఫలితంగా ఆర్టీసీ కార్మికులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు మడకశిర ఆర్టీసీ డిపోలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారు. డిపోలోని సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని ఆర్టీసీ కార్మికులు వాపోతున్నారు. సిబ్బంది, కార్మికులకు డిపోలో తగిన సౌకర్యాలు లేక నానాతంటాలు పడుతున్నారు. జిల్లాలో ఏ డిపోలో లేని సమస్యలు మడకశిర డిపోలో ఉండటంతో ఇబ్బందులు వర్ణనాతీతం.

భవనాలు నిర్మించరా?

మడకశిర డిపోలో డీఎం కార్యాలయానికే ప్రత్యేక గది లేదు. ప్రస్తుతం డీఎం ఆఫీస్‌ను ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ చిన్న గదిలో నిర్వహిస్తున్నారు. డీఎంతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డీఎం కార్యాలయం కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. అదే విధంగా డిపోలో క్లర్క్‌కు కూడా ప్రత్యేక గది ఉండాలి. ప్రత్యేక గది సౌకర్యం లేకపోవడంతో నగదు లావాదేవీలు నిర్వహించడానికి డిపో క్లర్క్ అవస్థలు పడుతున్నారు.

గ్యారేజీలో అనేక సమస్యలు

ఆర్టీసీ డిపోలో బస్సుల మెకానిక్ గ్యారేజ్ ప్రధాన విభాగం. ఈ గ్యారేజ్‌లో నెలకొన్న సమస్యలతో మెకానిక్‌ల అవస్థలు చెప్పలేనివి. బస్సులను కండీషన్‌లో ఉంచడంలో మెకానిక్‌లు కీలకపాత్ర పోషిస్తారు. అయితే గ్యారేజ్‌లో విడి భాగాల కొరత అధికంగా ఉంది. బస్సుల మరమ్మతులకు అవసరమైన విడి భాగాలు సమకూర్చక పోవడంతో బస్సుల కండీషన్ లోపిస్తుంది. ఇదిలా ఉండగా గ్యారేజ్‌లో సిబ్బంది కొరత కూడా ఉంది. మెకానిక్‌లకు అసిస్టెంట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అన్ని పనులను మెకానిక్‌లు చేయాల్సి వస్తోంది. మెకానిక్‌లకు పనిభారం అధికంగా ఉంటోంది.

పార్కింగ్‌కు అవస్థలు

ఆర్టీసీ కార్మికులు విధులకు హాజరయ్యేందుకు డిపో వద్దకు సైకిళ్లు, ద్విచక్ర వాహనాల్లో వస్తారు. అయితే ఈ వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా డిపోలో సైకిల్ స్టాండ్, వెహికల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా డిపోలో ఉన్న ఆర్ఓ ప్లాంట్ సక్రమంగా పని చేయడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఈ ప్లాంట్‌లో వచ్చే నీరు శుభ్రంగా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా బస్సు రూట్ల మార్పు

డిపో పరిధిలో తిరుగుతున్న బస్సు రూట్లను ఆర్టీసీ అధికారులు ఇష్టారాజ్యంగా మార్పు చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. కనీసం యూనియన్ నాయకుల అభిప్రాయాలు తెలుసుకోకుండా నిర్ణయం తీసుకుంటున్నారు. బస్సు రూట్లను మార్పు చేస్తుండటంతో ఆదాయం తగ్గడానికి కారణంగా మారుతోందని చెబుతున్నారు. ప్రధానంగా శిర బస్సును ఉదయం పూట పెనుకొండకు నడుపుతున్నారు. దీంతో అగళి, రొళ్ల మండలాల ప్రయాణికులు హిందూపురం వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా అమరాపురం, హేమావతి బస్సును పెనుకొండకు నడుపుతుండటంతో.. అమరాపురం మండల ప్రజలు హిందూపురం వెళ్లేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. గతంలో మడకశిర నుంచి హైదరాబాద్ మీదుగా జీడిమెట్లకు బస్సు సర్వీసు ఉండేది. అయితే ఈ బస్సు సర్వీసును ఏపీ–తెలంగాణ మధ్య జరిగిన ఒప్పందం మేరకు రద్దు చేశారు. ప్రస్తుతం మడకశిర ప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మడకశిర ఆర్టీసీ డిపో సమస్యల వలయంలో చిక్కుకుంది. కొన్నేళ్ల నుంచి డిపోలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలి.

– సిద్ధగంగప్ప, ఈయూ రీజినల్ నాయకుడు, మడకశిర

పార్కింగ్ సౌకర్యం కల్పించాలి



డిపోలో ఆర్టీసీ కార్మికులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా శ్రీశైలం సర్వీస్‌కు మూడు రోజులు మస్టర్ ఇవ్వాలి. డిపోలో కార్మికుల వాహనాలను నిలపడానికి ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. డిపో సమస్యలను పలు సార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం కాలేదు. వెంటనే అధికారులు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

– రఫీక్, ఈయూ అధ్యక్షుడు, మడకశిర డిపో

కార్మికుల సమస్యలపై ఉద్యమిస్తాం



ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతాం. ప్రధానంగా డిపో సమస్యలు పరిష్కరించాలి. శ్రీశైలం సర్వీసుకు వెళ్లే ఆర్టీసీ కార్మికులకు మూడు రోజుల పని దినాలు ఇవ్వాలి. మడకశిర డిపో నుంచి నడుపుతున్న హైదరాబాద్, జీడిమెట్ల బస్సును పునరుద్ధరించకపోతే ఆందోళనకు దిగుతాం. వెంటనే అధికారులు సమస్యలను పరిష్కరించి కార్మికులకు అండగా నిలబడాలి.

– రంగనాథ్, ఈయూ కార్యదర్శి, మడకశిర డిపో

పశుగణన సక్రమంగా చేపట్టండి



మాట్లాడుతున్న డీడీ పెంచలయ్య

పెనుకొండ: పశుగణన సక్రమంగా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ డీడీ పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం పట్టణంలో ఆయన పశుగణన సర్వే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో ఏ మేరకు ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకల వివరాలు, అవి ఏ జాతికి సంబంధించినవన్న విషయాన్ని సమగ్రంగా సర్వే నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు ఏఏ మండలంలో ఎంత మేర సర్వే చేసారన్న విషయాలను డీడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏడీ శ్రీరాములు నాయక్, మండల పశువైద్యాధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ. 47,642 రికవరీకి ఆదేశం

పెనుకొండ రూరల్: ఉపాధిహామీ పనుల్లో జరిగిన అక్రమాల్లో రూ.47,642లు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గ్రామీణ ఉపాధిహామీ పనులపై విజిలెన్స్ అధికారుల సమక్షంలో సామాజిక తనిఖీ బహిరంగ వేదిక నిర్వహించారు. 2023 నుంచి 2024 వరకు మండలంలో రూ.6,268,570 ఉపాధి పనులకు వెచ్చించారు. అందులో ఇంకుడు గుంతలు, పండ్ల మొక్కలు పెంపకం, భవన నిర్మాణాలు, తదితర పనులు చేపట్టారు. మండల వ్యాప్తంగా రాంపురం, కురుభవాండ్లపల్లి, మావటూరు, మునిమడుగు, శెట్టిపల్లి, వెంకటగిరిపాళ్యం, నాగళూరు, గుట్టూరు, దుద్దేబండ, అడదాకులపల్లి, గోనిపేట, పంచాయతీ గ్రామాలకు సంబంధించి రూ.47,642 రికవరికి అధికారులు ఆదేశించినట్లు ఏపీఓ జయమ్మ తెలిపారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఎంఏ పీడీ విజయ ప్రసాద్, జిల్లా విజిలెన్స్ అధికారి రమణా రెడ్డి, సర్పంచ్‌లు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

గుడిబండ: గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీడీఓ గంగాధర్ అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీఓ గంగాధర్ ఆధ్యక్షతన సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే ప్రణాళిక ఉండాలని, ప్రణాళిక లేకపోతే అభివృద్ధి శూన్యమని తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలకు వీధి దీపాలు, తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజు నాయక్, ట్రైనర్ ప్రకాష్, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ'



పూలవ్యాపారితో ముచ్చటిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: మాజీ మంత్రి , శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ మంగళవారం ఉదయం మంచుకురిసే వేళలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయం సమీపంలోని రమణా టీస్టాల్ వద్ద ప్రజలతో ముచ్చటించారు. టీస్టాల్ యజమానితో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచిచౌడమ్మ గుడి వద్ద చిరువ్యాపారులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాలన ఎలా ఉందని చిరు వ్యాపారి రామాంజనేయులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ సర్కిల్ వద్దకు చేరుకొని బెంగళూరు బేకరి పక్కనున్న మరో టీస్టాల్ వద్ద స్థానికులతో ముచ్చటించారు. బస్టాండ్‌వద్ద ఉన్న బస్ షెల్టర్ వద్ద మహిళా ప్రయాణికులతో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మహిళలకు ఉచిత బస్సు ప్రయణం అని చెప్పి అమలు చేశారా? అని ప్రశ్నించారు. అందుకు మహిళలు స్పందిస్తూ కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడిచినా ఏ ఒక్కటీ అమలు చేయలేదని, సంక్షేమ పథకాల కోసం, హామీలు అమలు చేస్తారని ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్ వరకు ప్రజలను పలకరిస్తూ కార్యక్రమం కొనసాగించారు.



వేకువజామున చలిమంట కాసుకుంటున్న ఉషశ్రీ చరణ్ తదితరులు

అక్కడ పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి ఉషశ్రీ, ఆమె భర్త చరణ్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు చలిమంట కాసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, టౌన్ కన్వీనర్ మేదర శంకర, బోయ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, ముఖ్య నాయకులు గంపల వెంకటరమణారెడ్డి, నార్శింపల్లి రాఘురామిరెడ్డి, శివారెడ్డి, బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, బూదిలి రవీంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారులకు న్యాయం చేయండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న చిరు వ్యాపారుల సంఘం నాయకులు

హిందూపురం: తమకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం తోపుడుబండ్ల వ్యాపారులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని గాంధీబజార్ వద్ద చిన్న వ్యాపారులు 30 ఏళ్ల నుంచి అక్కడే వ్యాపారాలు చేస్తూ జీవనం గడుపుతున్నారు. అక్కడే వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని వారు కోరారు.అక్కడి నుంచి బలవంతంగా తొలగించవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు మున్సిపల్ ఆఫీసులోకి రాకుండా గేట్ల వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అధికారులతో సంప్రదింపులు చేసి న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌళూరు రవి కుమార్, పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, ఏఐటీయూసీ ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి నౌషాద్, కమల్‌బాషా, చిరు వ్యాపారులు రాధమ్మ, మహదేవ్, హుస్సేన్ పీరా, అక్బర్, చాంద్ బాషా, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో టెన్త్ ప్రశ్నపత్రాలు

మడకశిర రూరల్/రొళ్ల: ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి ఎస్ఏ–1 ప్రశ్నపత్రాలను మంగళవారం ఉదయం మడకశిరలోని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ఇటీవల పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ విషయం తెలిసిందే. దీంతో బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ (పీఎస్) సోషల్, సైన్స్, గణిత శాస్త్రం పేపర్–2 పశ్న పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. పరీక్ష సమయానికి గంట ముందు హెచ్‌ఎంలు వచ్చి పశ్న పత్రాలను తీసుకెళ్లాలని ఎంఈఓ తెలిపారు. అలాగే రొళ్ల మండలంలోని రత్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన ఎస్ఏ–1 పరీక్ష నిర్వహణను ఎంఈఓ శ్రీధర్ పర్యవేక్షించారు. ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

సంక్షిప్త వార్తలు

నేడు బాబయ్య స్వామికి చాదర్ సమర్పణ

పెనుకొండ రూరల్: ప్రసిద్ధి గాంచిన పెనుకొండ బాబయ్య స్వామి, ఉరుసు సందర్భంగా దర్గాలోని బాబాయ్య స్వామి సమాధికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ బుధవారం చాదర్ సమర్పించనున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

రొద్దం: మండలంలోని నల్లూరు గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహాల మండలి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంతో మహిళలపై వివక్ష, హింసపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాలపై అవగాహనతో ఉండాలన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రొళ్ల: యుక్త వయస్సు రాక ముందు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలిద్దామని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి తదితరులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండో రోజు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది తదితరులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం వల్ల మానసిక, శారీరక ఒత్తిడికి గురి కావడంతో పాటు ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల్లో తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలురకు ధీటుగా బాలికలను ఉన్నత చదువులు చదివించడానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే 100,1098 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

మడకశిర రూరల్: ఆమిదాలగొంది గ్రామంలోని వేంకటేశ్వర వృద్ధాశ్రమంలో మంగళవారం తాలూకా సింహగిరి పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేసి, వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో 75 ఏళ్లు నిండిన పింఛన్‌దారులను సన్మానించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు శాంతవీరప్ప, ఉపాధ్యక్షులు గణపతి, సెక్రటరీ ఫక్రుద్దీన్, కోశాధికారి రాజారావు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'బిల్డింగ్స్, షెడ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలి'

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చట్టం ప్రకారం ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారా మాత్రమే బిల్డింగ్స్,షెడ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మ్యానువల్, ఆఫ్‌లైన్‌లో బిల్డింగ్‌లు, షెడ్లకు అనుమతి ఇవ్వబోమని కమిషనర్ అన్నారు. అక్రమ లేవుట్లు, కట్టడాలు, షెడ్లు, డివిలేషన్ బిల్డింగ్‌లను నిబంధనల మేరకు తొలగిస్తామన్నారు. 2017 నుంచి ఇప్పటి వరకూ ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ అనుమతులు పొంది పెండింగ్ ఫీజులు చెల్లించని వారు తమ సంబంధిత ఇంజనీర్లు, ఎల్‌టీపీ ద్వారా 25వ తేదీలోపు చెల్లించాలని ఆయన కోరారు.

లక్ష్మీనృసింహుడు,ఆంజనేయస్వామికి పూజలు

మడకశిర రూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయ స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులు ఆలయంలో తలనీలాలు సమర్పించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేయించి, దర్శనం చేసుకున్నారు. వివిధ గ్రామాల భక్తులు జ్యోతులను సమర్పించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలను పూలపల్లకీలో కొలువుదీర్చి రాత్రి భక్తరపల్లి నుంచి జిల్లెడుగుంట అంజనేయస్వామి దేవాలయం వరకు పూలపల్లకి, గరుడోత్సవ ఉత్సవం నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు.

నేడు జ్యోతుల ఉత్సవం..

మండలంలోని జిల్లెడుగుంట సమీపంలో వెలిసిన కంబాల నరసింహస్వామికి బుధవారం జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామాల ప్రజలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



అమరాపురంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సోమందేపల్లి/లేపాక్షి/అమరాపురం/అగళి/రొద్దం: సోమందేపల్లి మండలంలో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రెవెన్యూ సదస్సులోఅధికారులకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. పందిపర్తి రెవెన్యూ పొలం సర్వే నంబరు 384లో అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న కోరారు. నక్కలగుట్టలో అనుభవంలో ఉన్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని సోమందేపల్లిలోని 744 సర్వే నంబర్‌లో సాగులో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు. అలాగే లేపాక్షి మండలంలోని కంచిసముద్రం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 11 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. అదేవిధంగా అమరాపురం పంచాయతీ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ మారుతి ప్రకాష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 అర్జీలు అందజేసినట్టు తహసీల్దార్ మారుతి ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ విన్సెంట్ పాల్, వీఆర్వో, వీఆర్ఏలు రైతులు పాల్గొన్నారు. అగళి: మండలంలోని కోడిపల్లిలో జరిగిన గ్రామసభకు ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్ఓ, సర్వేయర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రొద్దం: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాన వికాసాన్ని సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన కింద రూపొందించిన మహిళా జ్ఞాన వికాసం పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ప్రయోజనాలు పొందాలని స్థానిక సీడీపీఓ సునీత తెలిపారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన జ్ఞాన వికాస మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. ధర్మస్థల సంస్థ ధర్మాధికారి డా. వీరేంద్ర హెగ్గడె సతీమణి హేమావతి ఆశీర్వాదాలతో కేంద్రాల ద్వారా వివిధ రీతుల్లో జాగృతి కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రతి మహిళ జ్ఞాన వికాస యోజన ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బెంగుళూరు ప్రాదేశిక కార్యాలయం యోజనాధికారి సంధ్యా శెట్టి, తాలూకా యోజనాధికారి మహేశ్, వైద్యాధికారి డా.పూజ, మున్సిపల్ ఉపాధ్యక్షురాలు గీత హనుమంతరాయప్ప తదితర జ్ఞాన వికాస సంఘాల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.